## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశ పౌరులు తమ ప్రవర్తనలో రాజ్యాంగ ఆదర్శాలను తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.

- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత న్యాయవ్యవస్థ 2023-24 వార్షిక నివేదికను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈరోజు విడుదల చేశారు.

- క్వాంటమ్ టెక్నాలజీలో భారత్ సాధిస్తున్న పురోగతిని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రశంసించారు.

- బంగ్లాదేశ్ లో మైనారిటీలకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛతో సహా భద్రత కల్పించాలని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు ఓ ప్రకటనలో తెలిపింది.

========================

భారత రాజ్యాంగాన్ని సజీవమైన ప్రగతిశీల పత్రంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాల్ ఆఫ్ సంవిధాన్ సదన్‌లో ఏర్పాటు చేసిన హమారా సంవిధాన్.. హమారా స్వాభిమాన్... వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ పౌరులు తమ ప్రవర్తనలో రాజ్యాంగ ఆదర్శాలను తీసుకోవాలని వారి ప్రాథమిక విధులను నెరవేర్చాలని రాష్ట్రపతి ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క జాతీయ లక్ష్యాన్ని సాధించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాజ్యాంగం ద్వారా దేశం సామాజిక లక్ష్యాలను సాధిస్తోందని సామాన్యుల జీవితాలు సుఖమయం కావడానికి కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలు కలసికట్టుగా పనిచేయడమే కర్తవ్యమని ద్రౌపది ముర్ము పేర్కొంటూ ...

(వాయిస్ 25 సెకన్లు)

ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్రమంత్రులు, లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులు, పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశిక ఉత్సవ పఠనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాయకత్వం వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈరోజు సుప్రీం కోర్ట్ లో జరిగిన వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత న్యాయవ్యవస్థ 2023-24 వార్షిక నివేదికను నరేంద్ర మోడీ విడుదల చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.... భారతదేశ ఆకాంక్షలు, కలలు కాలక్రమేణా నూతన శిఖరాలకు చేరుకుంటాయని, మన రాజ్యాంగ నిర్మాతలు ముందే ఊహించారని తదనుగుణంగా స్వతంత్ర భారతదేశంలో పౌరుల అవసరాలు సవాళ్లు దృష్ట్యా రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ లో ఈరోజు బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం రాజ్యాంగ శక్తిని తెలియజేస్తుందని అన్నారు. రాజ్యాంగం అంటే కేవలం చట్టాలు పొందుపరిచిన పుస్తకం మాత్రమే కాదని నిరంతరం ప్రవహించే చైతన్యవంతమైన ప్రవాహమని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌లతో కలిసి ఈరోజు 26/11 ముంబై ఉగ్రదాడి 16వ వార్షికోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. 2008లో ముంబై నగరంలో జరిగిన ఉగ్రదాడిలో పోరాడి అంతిమ త్యాగం చేసిన పోలీసు అధికారులు, జవాన్ల అమరవీరుల స్మారకార్థం ముంబై పోలీస్ కమిషనరేట్ ఆవరణలోని పోలీసు అమరవీరుల స్మారక చిహ్నం వద్ద వారు పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు పరామర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం చెన్నైకి ఆగ్నేయంగా 830 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది రాగల 12 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారి శ్రీలంక, తమిళనాడు తీరాల వైపు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది. అల్పపీడనం కారణంగా కోస్తా తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా వేడుకలు గోవాలో కొనసాగుతున్నాయి. ఈరోజు జరిగిన మాస్టర్ క్లాస్ సెషన్ లో స్టీఫెన్ వూలే చలనచిత్ర నిర్మాణం యొక్క 5 కీలకమైన దశలపై తన అనుభవాలను పంచుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా గోల్డెన్ పీకాక్ అవార్డు కోసం పోటీ పడుతున్న ఆర్టికల్ 370 చిత్ర దర్శకుడు ఆదిత్య సుహాస్ జంభలే మాట్లాడుతూ... ఈ ఉత్సవం తనకు అత్యంత సుసంపన్నమైన అనుభూతిని కలిగించిందని అన్నారు. సృజనాత్మకత, అభిరుచి, సంస్కృతితో ప్రపంచ సినిమా సజీవంగా ఉండే ఈ ప్రతిష్టాత్మక ఉత్సవంలో భాగం కావడం గొప్పగా అనిపిస్తుందని ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

క్వాంటమ్ టెక్నాలజీలో భారతదేశాన్ని గ్లోబల్ లీడర్ గా నిలపాలనే లక్ష్యంలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపిక అయిన 8 అంకుర సంస్థలను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ప్రకటించారు. న్యూ ఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... నేషనల్ క్వాంటమ్ మిషన్ ఎన్ఎం-ఐసీపీఎస్ కింద ఈ 8 వినూత్న అంకుర సంస్థలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. క్వాంటమ్ సైన్స్ యొక్క ప్రత్యేక సూత్రాలను ఉపయోగించుకోవడం ద్వారా మన జీవితంలోని అనేక అంశాలను విప్లవాత్మకంగా మార్చడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. క్వాంటమ్ కమ్యూనికేషన్ ద్వారా హ్యాకర్లు సున్నితమైన డేటాను అడ్డుకోవడం లేదా ట్యాంపరింగ్ చేయడం దాదాపు అసాధ్యమని పేర్కొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీలో భారత్ సాధిస్తున్న పురోగతిని మంత్రి జితేంద్ర సింగ్ ప్రశంసిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్ లో మైనారిటీలకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛతో సహా భద్రత కల్పించాలని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్ సమ్మిలిత్ సనాతన్ జాగరణ్ జోతే చిన్మోయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్ నిరాకరించడం పట్ల విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై ఉగ్ర దాడుల తర్వాత ఈ సంఘటన జరిగిందని పేర్కొంది. మైనారిటీల గృహాలు, వ్యాపార సంస్థలను దోచుకోవడం, దేవాలయాలను అపవిత్రం చేయడం వంటి అనేక కేసులు నమోదవుతుండటం దురదృష్టకరమని అని పేర్కొంది. ఈ సంఘటనలకు పాల్పడినవారు పరారీలో ఉండగా, శాంతియుత సమావేశాల ద్వారా న్యాయబద్ధమైన డిమాండ్‌లను సమర్పించే నాయకుడిపై అభియోగాలు మోపడం సరికాదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో రానున్న ముడు రోజుల పాటు మంచు వర్షం కురుస్తుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 29వ తేదీ వరకు వాతావరణం సాధారణంగా పొడిగా ఉంటుందని, నవంబర్ 30వ తేదీ సాయంత్రం నుండి ఎత్తైన ప్రాంతాలలో, ఏకాంత ప్రదేశాలలో తేలికపాటి వర్షం, తేలికపాటి మంచు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 415 లాభాల్లో ప్రారంభమై 80 వేల 004 వద్ద ముగిసింది. నిఫ్టీ 24 వేల 194 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.33గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =